క్లుప్తంగా

పచ్చదనం ఆవిరి



పొన్నూరు: పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. దీనికనుగుణంగా రహదారుల వెంబడి పచ్చదనానికి మొక్కలు పెంచి పురపాలిక శాఖ ఆహ్లాద వాతావరణాన్ని పంచాలి. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. పట్టణంలోని నిడుబ్రోలు వంతెనపై రహదారి పక్కన నడకదారిపై ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు కనిపించడం లేదు. రెండు పక్కలా 30కి పైగా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నెల 30న వన మహోత్సవం చేయాలనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటేలా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

పెదకాకాని: మండలంలోని కొప్పురావు హైస్కూల్ వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 17న గుంటూరు పీడీ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో జిల్లాలో అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, సెంటర్లలో బాత్రూములు నిర్మించాల డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా గ్యాస్ ఇతర సామగ్రి ధర పెంచాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ కార్యదర్శి కె. రాజలక్ష్మి, ప్రసన్న కుమారి, శ్రీలక్ష్మి, సీఐటీయూ నాయకులు నన్నపనేని శివాజీ పాల్గొన్నారు.

కాకుమానులో పిచ్చికుక్క స్వైర విహారం

కాకుమాను: మండల కేంద్రం కాకుమానులో బుధవారం ఉదయం పిచ్చికుక్క స్వైర విహారంతో తొమ్మిది మంది గాయపడ్డారు. ఉదయం ఇంటి పనులు చేసుకుంటున్న పలువురు మహిళలపై దాడి చేసి గాయపరచింది. కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారికి వ్యాక్సిన్ వేసి ప్రథమ చికిత్స అందించారు.వీరిలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో బాపట్ల ప్రజా వైద్యశాలకు తరలించారు.

ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' లక్ష్యం

డ్వామా పీడీ ఉమాదేవి

కాకుమాను: గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించే విధంగా సిబ్బంది పని చేయాలని డ్వామా పీడీ ఉమాదేవి తెలిపారు. పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్డులు లేని వారిని గుర్తించి వెంటనే మంజూరు చేసి పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. పనుల నాణ్యతలో, కూలీల హాజరులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.గ్రామ సభల్లో గుర్తించిన అవకతవకల్ని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ శివన్నారాయణ, కౌముది, ఎంపీడీవో సాయిలీల, ఇన్‌చార్జి ఏపీవో సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో డబ్బులు చెల్లించాలి

ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియోగ్రాఫర్లు



పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన తమకు పారితోషికం అందించడంలో తీవ్ర జాప్యం చేస్తూ తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని పట్టణ వీడియోగ్రాఫర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రశాంతిని బుధవారం కలిసి తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఒక్కో వీడియోగ్రాఫర్‌కు రోజుకు రూ. 5 వేల ఒప్పందం ప్రకారం మార్చి 18వ తేదీ నుంచి మే 13 వరకు 57 రోజులు ఎన్నికల విధులు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఉన్న తహసీల్దార్ నారాయణసింగ్ రోజుకు రూ. 5 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు పని చేశామని పేర్కొన్నారు. ఆయన బదిలీపై వెళ్లడంతో అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, రావాల్సిన మొత్తంలో కోత విధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రోజుకు రూ. 3 వేలు ఇస్తామని అధికారులు చెప్పడాన్ని వ్యతిరేకించారు. తమకు పూర్తి మొత్తాన్ని వెంటనే చెల్లించాలని కోరారు.

వైద్యశాలల్లో మహిళలకు రక్షణ కల్పించాలి



వైద్యశాలల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులతో పాటు సిబ్బందికి రక్షణ కల్పించాలి. వైద్యవృత్తిని నమ్ముకొని రాత్రి, పగలు కష్టపడి పనిచేస్తున్నా సరైన భద్రత లేకపోవడంతో భయాందోళనలకు గురవుతున్నాం. రాత్రి సమయాల్లో ఆసుపత్రి ప్రాంతంలో పోలీసులతో ప్రత్యేక నిఘా ఉంచాలి. వైద్యులు ధైర్యంగా రోగులకు చికిత్స అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

–ఎం. పద్మావతి. స్టాఫ్ నర్స్. పొన్నూరు



పూర్తిస్థాయి నిఘా అవసరం



పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయి నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. చాలా ఆస్పత్రుల్లో కెమెరాలు లేవు. దీంతో రాత్రిపూట విధులకు హాజరవుతున్న మహిళా వైద్యులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. పరిసర ప్రాంతాల్లో లైట్లు కూడా ఏర్పాటు చేయాలి.

–ఎం. వేణు, పీహెచ్‌సీ. మన్నవ

రోజుకు ఇరవై మెట్రిక్ టన్నుల ఇసుక

గుంటూరు ఆర్డీవో ఎం. గంగరాజు

ప్రత్తిపాడు: ఒక వ్యక్తికీ రోజుకు ఇరవై మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే ఇస్తామని గుంటూరు ఆర్డీవో ఎం. గంగరాజు పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక బుకింగ్ కౌంటర్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. బుకింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ ప్రక్రియను కార్యాలయ పనివేళల్లోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుకింగ్స్ పూర్తి వివరాలను రిజిస్టర్లలో పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతిరోజూ బుకింగ్స్‌కు సంబంధించిన వివరాలను తెలియజేయాలని సూచించారు.

ఇసుక బుకింగ్‌కు కౌంటర్ల వద్దకు వచ్చే సమయంలో బండి వివరాలు అందించాలని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు చార్జీలు కట్టి బుక్ చేసుకున్న వారికే ఆన్‌లైన్ స్లాట్‌ను కేటాయిస్తామని స్పష్టం చేశారు. యార్డులో నిర్ణీత సమయానికి ఇసుకను లోడింగ్ చేస్తామని తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసుకోని వారి వాహనాలను యార్డు లోపలకు అనుమతించరని వివరించారు. ఆయన వెంట ఆర్ఐ సాహితి తదితరులు న్నారు.



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక బుకింగ్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న గంగరాజు

'సీజనల్' టైంలోనూ నిర్లక్ష్యం



మధ్యాహ్నం రెండున్నర గంటలకు తాళాలు వేసి ఉన్న కొత్తమల్లాయపాలెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్



కేంద్రం బయటే వదిలేసిన బెడ్

ప్రత్తిపాడు: గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎప్పుడు తెరిచి ఉంటాయో? ఎప్పుడు మూసి ఉంటాయో? తెలియని పరిస్థితి స్థానికంగా చోటుచేసుకుంటుంది. ఓ పక్క వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో జనం జ్వరాలు, జలుబులు, దగ్గులతో గ్రామాల్లో నానా ఇబ్బందులు పడుతున్నారు. వారికి ఆపద వేళ ఉపశమనాన్ని కలిగించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో సబ్‌సెంటర్లలో అందుబాటులో ఉండటం లేదు. అందుకు సాక్ష్యమే ఈ చిత్రం. కొత్తమల్లాయపాలెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ మంగళవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఇలా తాళాలు వేసి కనిపించింది. కేంద్రం లోపల ఉండాల్సిన మంచాలు సైతం కేంద్రం బయట పడేసి తాళాలు వేసి సిబ్బంది వెళ్లిపోవడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం.

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

- నిరుపయోగంగా మునిపల్లె సంపద కేంద్రం
- ఆరుబయట చెత్తకు నిప్పు
- పొగతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



చెత్తకు నిప్పుపెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

పొన్నూరు: పల్లెలు అభివృద్ధి పథంలో పయనించాలన్న సదుద్దేశంతో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. మండలంలోని మునిపల్లె గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలో చెత్త, వ్యర్థాల నిర్వహణ గాలికొదిలేసి వాటికి నిప్పు పెడుతున్నారు. మెయిన్ రోడ్డుపై పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను మెయిన్‌రోడ్డుపై ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ చెత్తను సంపదగా మార్చాల్సి ఉండగా దానికి నిప్పుపెట్టి చేతులు దులుపుకుంటున్నారు. కనీసం యార్డు లోపలికి కూడా చేర్చకుండా గుంటూరు మెయిన్ రోడ్డు వెంబడి వేస్తున్నారు. అది గాలికి ఎగిరి రహదారి పైకి చేరుతోంది. చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పొగతో ఎదురెదురు వాహనాలు సైతం కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. సమస్యను పొన్నూరు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ నారాయణరావు దృష్టికి తీసుకెళ్లగా సమస్యను సంబంధిత పంచాయతీ అధికారులకు తెలియజేసి, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

'బడి బాట' అభివృద్ధికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: మండలంలోని వెల్లలూరు గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు డీఈఓ పి. శైలజ తెలిపారు. 'బడి బాట' అధ్వానం శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఈఓ స్పందించారు. సమస్యను గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లి, రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపడతామని ప్రకటనలో వివరణ ఇచ్చారు.

క్రీడల్లో నారాకోడూరు హైస్కూల్‌కు అవార్డు

చేబ్రోలు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలకు ఇచ్చే ఎక్సలెన్స్ అవార్డుకు చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ ఎంపికైనట్లు హెచ్ఎం ఎం. ఏడుకొండలు బుధవారం తెలిపారు. గుంటూరులో గురువారం జరిగే క్రీడా దినోత్సవంలో అవార్డును అందుకోనున్నట్లు చెప్పారు. హైస్కూల్ నుంచి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్‌లో పదిమంది క్రీడాకారులు బహుమతులు పొందారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 22మంది గుంటూరు జిల్లా తరఫున ఆడినట్లు పేర్కొన్నారు. ఇందులో ఏడుగురు గోల్డ్ మెడల్స్, బాలికల్లో నలుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించారని వివరించారు. దీని దృష్ట్యా క్రీడల్లో జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. అవార్డు రావటానికి కారణమైన పీఈటీని, క్రీడాకారులను స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరి విగ్రహ ప్రతిష్ట



గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో బుధవారం భగవాన్ ధన్వంతరి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, షేక్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు. మహోత్సవాన్ని బాలేపల్లి సత్యనారాయణ, లలితాంబలు పర్యవేక్షించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వంద పడకలతో అతిపెద్ద ఆయుర్వేద వైద్యశాల గుంటూరులో నిర్మించడం, కేరళ పంచకర్మ వైద్యాన్ని నగర ప్రజలకు చేరువ చేయడం సంతోషకరమని అతిథులు ప్రశంసించారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం దీక్ష హోమాలు, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలోని ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ వద్దు

సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి



మధ్యాహ్న భోజనం చేస్తున్న సమగ్ర ఏపీసీ విజయలక్ష్మి, ఎంఈవో రమాదేవి

ప్రత్తిపాడు:మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఏజెన్సీలు రాజీ ధోరణి అవలంబించవద్దని సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి చెప్పారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు రాస్తున్న పరీక్షలను తరగతుల వారీగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులున్నారు? గైర్హాజరు ఎంత మంది ? అనే వివరాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరుసగా రెండు రోజులు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేసి కారణాలను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ఆమె వెంట ఎంఈవో సీహెచ్. రమాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పక్కాగా పరీక్షల నిర్వహణ

ఎంఈవో సీహెచ్. రమాదేవి



కొండేపాడు ఎల్ఈ పాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో

ప్రత్తిపాడు: పరీక్షలను పక్కాగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలను బుధవారం ఆమె పరిశీలించారు. పరీక్షలు ఎలా రాస్తున్నారు? పేపర్ అర్థమయ్యిందా లేదా ? అనే వివరాలను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు సమర్థంగా పరీక్షలు రాసేలా హెచ్ఎంలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హైస్కూల్స్‌లో 30న హిందీ, 31న ఇంగ్లిషు, సెప్టెంబరు 2న గణితం, 3న సామాన్య శాస్త్రం, 4న సాంఘిక శాస్త్రం, ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు 30న ఇంగ్లిషు, 31న గణితం, సెప్టెంబరు 2న ఈవీఎస్ పరీక్షలు ఉంటాయని ఎంఈవో వివరించారు. ఉదయం స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో-2 జి. లీలారాణి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్షా పత్రాలను అందజేశారు.

'నీరు'పయోగంగా ట్యాంక్



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వాటర్ ట్యాంక్

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 75 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో గ్రామస్తుల తాగునీటి అవసరాల నిమిత్తం ఓవర్ హెడ్ ట్యాంక్‌తో పాటు పైప్‌లైన్ నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించి, కొద్ది నెలల కిందటే ఆర్‌డబ్ల్యూఎస్‌కు పంచాయతీ అధికారులకు అప్పగించారు. కానీ వారు ట్యాంకును వినియోగించకుండా రకరకాల కారణాలు చూపి నిరుపయోగంగా వదిలేశారు. ట్యాంకు వినియోగంలోనికి వస్తే ప్రత్తిపాడు శివారు ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు తీరుతాయి. కానీ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ట్యాంకు వినియోగంలోనికి రాలేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్‌ను 'సాక్షి' ప్రశ్నించగా నిర్మాణం సమగ్రంగా పూర్తి చేసి ఎప్పుడో గ్రామ పంచాయతీకి అప్పగించామని, కానీ వాడటం లేదని చెప్పారు.

విజ్ఞాన్ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ నుంచి పట్టా అందుకుంటున్న నాగలక్ష్మి

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నం నాగలక్ష్మికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందజేసిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ''స్క్రీనింగ్ అండ్ ఎవాల్యూషన్ ఆఫ్ బయోయాక్టివ్ మెటబోలైట్స్ ఫ్రమ్ కుర్కుమ లోంగ అండ్ టినోస్పోర కార్డిఫోలియో అగెనెస్ట్ పల్మనరీ ఫైబ్రోసిస్ ఇన్ మైస్'' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేశారు. డాక్టరేట్ పొందిన నాగలక్ష్మిని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీ ప్రొఫెసర్‌కు...



సునీత

గుంటూరు రూరల్: విద్యార్థులకు, అధ్యాపకుల లక్ష్య సాధనకు తమ కళాశాల ఎప్పుడూఅండగా ఉంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి. సునీతకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని చెప్పారు. ఆమె డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ మల్టీ బాండ్ మైక్రో స్ట్రిప్ పాచ్ యాంటెనాస్ యూజింగ్ గ్రౌండ్ మోడిఫికేషన్ టెక్నిక్స్ ఫర్ వైర్‌లెస్ అప్లికేషన్స్ అనేఅంశంపై నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎస్. నాగకిశోర్ పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో పీహెచ్‌డీ కలిగిన స్టాఫ్ మొత్తం 147 మంది ఉన్నారని పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, టి. రంగబాబు అభినందించారు.

విక్టోరియా కళాశాల ఎదుట విద్యార్థుల నిరసన



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

- యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం

గుంటూరు రూరల్: కళాశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆందోళన, నిరసన వ్యక్తం చేసిన సంఘటన బుధవారం నల్లపాడు గ్రామంలోని విక్టోరియా ఫార్మసీ కళాశాల వద్ద చోటు చేసుకుంది. విద్యార్థుల కథనం ప్రకారం.. కళాశాలలో విద్యార్థినులకు అనుమతి లేకున్నా హాస్టల్‌ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థినులు ఉండే రూముల ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని, అవి తమకు ఇబ్బందిగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థినుల హాస్టల్ రూముల పక్కనే కళాశాలకు సంబంధం లేని వ్యక్తులు ఉంటూ మత్తు పదార్థాలను సేవిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంచెం ఆలస్యమైనా టిఫిన్, భోజనాలు సైతం పెట్టకుండా హాస్టల్ వార్డెన్ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. అదేమని అడిగితే పలువురు అధ్యాపకులు కావాలని విద్యార్థులను టార్గెట్ చేస్తూ బ్యాక్‌లాగ్స్ రాయనివ్వకుండా బెదిరిస్తున్నారని తెలిపారు. అధికారులు యాజమాన్యంపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కళాశాల గేటు ఎదుట బైఠాయించి డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం మాత్రం కావాలని కొందరు అధ్యాపకులే విద్యార్థులను రెచ్చగొట్టి నిరసనకు ఉసిగొల్పారని ఆరోపించింది.అధ్యాపకుల ఇంక్రిమెంట్లు, సర్టిఫికెట్స్ విషయంలో వచ్చిన వివాదాన్ని విద్యార్థులపై నెట్టి నిరసనకు పాల్పడ్డారని పేర్కొంది.

తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎన్ కాలనీపార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన తాగునీటి కేంద్రం, వెయిటింగ్ రైన్ షల్టర్స్‌లను బుధవారం మాదల రత్నగిరిబాబు, వికాస్ విద్యా సంస్థలు అధినేత శంకరావు, డాక్టర్ శివాజీ, డాక్టర్ రాజ, కార్పొరేటర్ వేములపల్లి శివరామకృష్ణప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు. తాగునీటి కేంద్రం, బరువు యంత్రం, రైన్ షెల్టర్‌ను మాదల రత్నగిరిబాబు, మాదల చైతన్య, డాక్టర్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ మాదల పూజ, మాదల శ్రీరామ్‌భాస్కర్ సౌజన్యంతో నిర్మించారు. వాటికి రూ. 3.20 లక్షలు వెచ్చించారు. కార్యక్రమంలో తారకరామ్ ఎస్‌వీఎన్ కాలనీ పార్క్ సెంటర్ పార్క్ అధ్యక్షులు పొండ సారథి, కార్యదర్శి వేణు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ పార్కుకు అవసరమైన వాటికి సహకరిస్తామని తెలిపారు. ఉద్యానవనం అభివృద్ధికి, పార్కులో గ్రంథాలయం ఏర్పాటుకు ఇతోధికంగా ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ స్వర్ణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విశేష అర్చన, హోమం, బలిహరణ, ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాల్ని ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టి. శ్రీనివాస్ పర్యవేక్షించారు.